
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు





# - 183 -

# 50వ టెక్సస్ సాహిత్య సదస్సు

ఈ మకుటం చూసి ఓరి నాయనోయ్ ...50 ఏళ్ళ నుంచీ టెక్సస్ లో సాహిత్య సదస్సులు జరుగుతున్నాయా అనీ, ఆ సమా'వేషాల' కి నేను అప్పటి నుంచీ వెళ్తున్నానేమో అని అనుమాన పడి నా వయసు ఎంతో అంచనాలు వేసేసుకోకండి....నా వయసు గురించి ఎక్కడ, ఎటువంటి చర్చ జరిగినా మా క్వీన్ విక్టోరియాకి ఆకాశవాణి ద్వారా తెలిసిపోతుంది. తస్మాత్ జాగ్రత్త. ఇంతకీ విషయం ఏమిటంటే...అప్పుడెప్పుడో 1998 లో యావత్ అమెరికాలో ఉన్న తెలుగు సాహిత్యం గాళ్ళందరినీ...అంటే రచయితలూ, కవులూ..ఆ బాపతు జనాభాని ఒకే చోటకి రప్పించి హాయిగా తెలుగులో మాట్లాడుకుంటే ఎలా ఉంటుందా అనిపించింది...అసలు ఆ జనాభా ఏమంటారో చూద్దాం అని ఆ జాతీయ స్థాయి మొట్టమొదటి అమెరికా తెలుగు సాహితీ సదస్సు అంటూ ఒక ప్రకటన విడుదల చెయ్యగానే మా పక్క ఊరులో ఉన్న ఒకాయన పిలిచి "అబ్బాయ్..మొత్తం అమెరికా దేశాన్ని ఉద్ధరించే ముందు ఇంట గెలిచి రచ్చ గెలుద్దాం. ఆ సదస్సు శాంపిల్ గా టెక్సస్ రాష్ట్రం లో పెడదాం..." అని ప్రపోజలు పెట్టాడు. "కదా" అని నాకు కూడా అనిపించింది. అలా మొదలయినదే ఈ నాటి టెక్సస్ సాహిత్య సదస్సుల పరంపర. అలా శుభారంభం జరిగినది ఆస్టిన్ లో. దానికి స్వీకారం చుట్టినది ప్రముఖ రచయిత సత్యం మందపాటి. అప్పటికీ, ఇప్పటికీ ఆయనే టెక్సస్ సాహిత్య సదస్సుల రథసారధి.

ఆ సాహిత్య సదస్సులు ప్రతీ ఆరు నెలలకీ ఒక్కొక్క టెక్సస్ నగరం లో ..అంటే మార్చ్–సెప్టెంబర్ లలో పెట్టుకుంటే బావుంటుంది అని కూడా అనేసుకుని నగరానికి ఒకరిద్దరు చొప్పున జీతం బత్తెం లేని 'సమన్వయ కర్తలు" అనే ఉద్యోగాలు మాలో మేమే అప్పజెప్పేసుకున్నాం. నలుగురినీ పోగేయడం, మన తెలుగు తల్లి ఎంత గొప్పదో మనలో మనమే అనేసుకుంటే ఎంత బావుంటుందో అందరికీ అప్పుడప్పుడు ఇంగ్లీషులో చెప్పడం మా సమన్వయ కర్తల ప్రధాన కర్తవ్యం. అప్పుడు ముందుకొచ్చిన హస్తినా పురం, సనాతన నగరి, గుడివాడ....అనుకుంటూ మేము ముద్దుగా పిలుచుకునే ఆ ఆస్టిన్,

హ్యూస్టన్, డాలస్, శాన్ ఏన్టోనియో, టెంపుల్ అనే నగరాలే అప్పటి నుంచీ ఇప్పటి దాకా వంతుల వారీగా ఈ టెక్సస్ సాహితీ సదస్సులు నిర్వహిస్తూ వచ్చాయి.

ఆ పరంపరలో మొన్న మార్చ్ 25-26, 2023 తేదీలలో గుడివాడ లో...అంటే టెంపుల్, టెక్సస్ అనే చిన్న నగరం లో మా 50వ టెక్సస్ సాహిత్య సదస్సు ....వైభవోపేతంగా జరిగింది. వైభవోపేతంగా...అని ఎందుకు అన్నానూ అంటే....టెక్సస్ లో అన్ని నగరాల నుంచీ సుమారు 150 మంది ఏదో పెళ్ళికి తరలి వచ్చినట్టుగా కుటుంబ సమేతంగా...పట్టు చీరలూ. నగలూ కూడా అలంకరించుకుని ఎంతో సంబడంగా రెండు రోజుల పాటు ఈ వేడుక జరిపించారు. పెళ్ళి పెద్ద సత్యం మందపాటి అయితే అన్ని ఏర్పాట్లూ చేసి వియ్యాల వారికి...పై ఊళ్ళనుంచి వచ్చిన వారు అందరూ వియ్యాల వారే కదా...అంటే మా అందరికీ ఎక్కడా అలకలూ, పేచీలూ పెట్టే అవకాశం లేకుండా ఆతిథ్యం ఇచ్చిన వారు డా. సుమ & ప్రసాద్ పోకల, డా. వై.వి. రావు & అంజలి దంపతులు...చెప్పుకోదగ్గ విశేషం ఏమిటంటే....ఆ గుడివాడ లో ఉన్న మొత్తం తెలుగు జనాభాని వెళ్ళ మీద లెక్క పెట్ట వచ్చు. అంత చిన్న ఊర్లో గోంగూర పచ్చడి తో సహా తెలుగు వంటలు చేయించి. హొటెల్ బస ఏర్పాటు చేసి, సదస్సు కి కావలసిన వేదిక ఏర్పాట్లు చేసి...50వ సదస్సు ని మాకు కలకాలం గుర్తు ఉండేటట్టు చేసిన ఆ నిర్వాహక మిత్రులకి వేనవేల ధన్యవాదాలు. ఎంత సంబడమో తెలియాలంటే మా సదస్సు పెళ్ళి వారి ఫొటో చూడండి.



ఈ 50వ సదస్సు ప్రణాళిక సత్యం మందపాటి చాలా పకడ్బందీగా రూపొందించారు. సుమారు 50 దాకా సాహిత్య ప్రసంగాలు, స్వీయ కవితా పఠనాలు, నాలాగా సొంత డబ్బా ఘాటిగా కొట్టుకోవడాలూ, మధ్యే మధ్యే నృత్యాలూ, సంగీతాలూ....కాఫీలు, టిఫెనీలు..ఇలా ఒహటేమిటి అందరికీ అన్నీ కాకపోయినా కొన్నైనా నచ్చే విధంగా ఈ సదస్సు దిగ్విజయంగా జరిగింది. ఎప్పటి లాగానే ఇర్షాద్ 'నిలబడే హాస్యం", ఊరిమిండి నరసింహా రెడ్డి "సిరి సంపదలు" తెలుగు క్విజ్ కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మా సంప్రదాయం ప్రకారం శాలువా కప్పడాలూ, సన్మానాలూ మరీ అంత నిషిద్ధం కాకపోయినా...చాలా చాలా పరిమితంగానే ఉన్నాయి. అందులో సిరికోన సాహితీ ఎకాడెమీ – జొన్నలగడ్డ స్మారక నవలల పోటీలో బహుమతి పొందిన పి.వి.శేషారత్నం, సత్యం మందపాటి గార్లకి శాలువా సత్కారం లభిస్తే నా

వంతుగా మా శాయి రాచకొండ తో కలిసి 28వ ఉగాది పోటీలో ఉత్తమ కవిత బహుమతి పొందిన ఇంద్రాణి పాలపర్తి ని నగదు బహుమతితో సత్కరించి కాలర్ ఎగరేసుకునే ప్రయత్నం చేశాను. ఈ సదస్సుకి ఇండియా నుంచి వచ్చిన బీరం సుందర రావు గారి ప్రసంగం బావుంది. ఆయనొక్కరే పాపం తన శాలువా తనే తెచ్చుకున్నారు.

ఇక పుస్తకావిష్కరణలలో మా అయ్యగారి సీతారామ్ వ్రాసిన “The science of Arunaprasna”– Cosmology to Quantum Physics” అనేది చెప్పుకోదగ్గది. అసలు భూమి ఎలా పుట్టింది, వాయువు, వర్షం, సూర్యరశ్మి, భూమ్యాకర్షణ శక్తి మొదలైన వాటి స్వరూపం ఏమిటే..ఇలాంటి అంశాల మీద సోదాహరణగా సాగిన సీతారామ్ ప్రసంగం ఎంతో ఆసక్తికరంగా జరిగింది. ఈ గ్రంథ మూలం కృష్ణ యజుర్వేదం, తైత్తరీయ కారకం లోని ‘అరుణ ప్రశ్న”. ఇక రెండోదీ...వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 110వ ప్రచురణ అయిన “మన ఘంటసాల” జీవిత కథ ఆవిష్కరణ. ఘంటసాల గారు బ్రతికి ఉన్నప్పుడే 1963 లో ఈ గ్రంథ రచనకి ఆయన అనుమతితో స్వీకారం చుట్టారు ప్రముఖ సాహితీ వేత్త, రేడియో ప్రయోక్త డా. పి.ఎస్. గోపాలకృష్ణ గారు. 1969 లో వ్రాయడం మొదలు పెట్టి, ఘంటసాల గారి నిర్యాణం తర్వాత కుటుంబం ప్రోద్బలం తో పూర్తి చేసిన ఆ గ్రంథం తొలి సారి 2003 లో ఎస్. పీ. బాలసుబ్రమణ్యం ముద్రించారు. ఇప్పుడు ఘంటసాలగారి శత జయంతి సందర్భంగా పున:ముద్రణ అవకాశం నాకు కలిగింది. ఈ సదస్సుకి 96 సంవత్సరాల జ్ఞానవృద్ధులు శ్రీ కాలనాధభట్ట వీరభద్ర శాస్త్రి గారు రావడం, ఆయన రచించిన ఘంటసాల “పుష్ప విలాపం” బాణీలో “కుసుమాభ్యర్ధన” గేయాన్ని ప్రముఖ గాయనీ, ఆయన కోడలూ అయిన శ్రీమతి మణి శాస్త్రి ఆలపించడం ఒక కొసమెరుపు. అలాగే పోతన గారి “ఎవ్వనిచే జనించు” పద్యాన్ని మా పప్పు సత్యభామ భక్తిపారవశ్యంతో ఆలపించగా నేను మా పుచ్చా మల్లిక్ వ్యవస్థాపకుడిగా పోతన భాగవత ఆణిముత్యాల సంస్థ రూపొందిస్తున్న పోతన భక్తి పద్యాల ఏనిమేషన్ చిత్రం గురించి సభికులకి పరిచయం చెయ్యడం నాకు మరపు రాని అనుభూతి.

మొత్తానికి తెలుగు సాహిత్య, సంగీత, జానపద, ఆధ్యాత్మిక, నాట్య కళా రంగాల పరంగా ఈ 50వ టెక్సస్ సాహిత్య సదస్సు అందరికీ ఎంతో ఆనందాన్నీ, ఉత్సాహాన్నీ కలిగించింది. ఇక మా క్వీన్ విక్టోరియా అయితే అక్కడికి వెళ్ళిన మరు క్షణం నుంచీ నన్ను పూర్తిగా మర్చిపోయి, అంతా అయ్యాక “మా డ్రైవర్ ఏడీ?” అని మాత్రమే నన్ను గుర్తుకు తెచ్చుకుంది.

**COMMENTS**